క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి: పట్టణానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం ఏసురెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మండలంలోని మంగళపల్లికి చెందిన బీజేపీ నాయకుడు కళ్లెం జగన్మోహన్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. కార్యక్రమంలో గుర్రం సంగ్రామ్‌రెడ్డి, గుర్రం సమరసింహారెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్, బీజేపీ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, నాయకులు శివ, అనూష్, మల్లేశ్, సాయికృష్ణ, రాజారాం, మధు, శశికుమార్, తదితరులున్నారు.

అనుమతులు లేని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాశ్ డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేయాలని, కార్పొరేట్ విద్యా వ్యవస్థను రద్దు చేసి అన్ని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో దోపిడీకి గురి చేసి, ఈ టెక్నో, కరిక్యులమ్, ఒలింపియాడ్ అంటూ పలు పేర్లతో మోసం చేస్తున్నాయని, బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఇప్పుడు ఉన్న ప్రభుత్వమైన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సులను అధికారులు సీజ్ చేసి కేసుబుక్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను డీఈవో సందర్శించి సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారించాలని, ఉపాధ్యాయులు సైతం పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా చూడాలని కోరారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అధికారులు పరిష్కారం చూపకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న ఎస్సై

గంగాధర: ఓ యువకుడు రూ.ముప్పై వేలు విలువ చేసే ఫోన్‌ను పోగొట్టుకోగా సీఈఐఆర్ టెక్నాలజీతో స్వాధీనం చేసుకున్న గంగాధర ఎస్సై కిరణ్‌రెడ్డి సోమవారం బాధితుడికి అప్పగించాడు. బెజ్జంకి మండలానికి చెందిన గడగోని రాకేశ్ జనవరిలో ఫోన్ పోగొట్టుకున్నాడు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన యాప్‌లో ఫోన్ వివరాలు నమోదుచేయగా వెబ్‌సైట్ ద్వారా ఫోన్ వివరాలు గంగాధర పోలీసులకు చేరాయి. వెంటనే పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నూతన కార్యవర్గం

గన్నేరువరం: గన్నేరువరం గ్రామ శ్రీలక్ష్మీనరసింహస్వామి ట్రాక్టర్ యూనియన్ నూతన కమిటీని సోమవారం గ్రామంలో యూనియన్ సభ్యులు సమావేశమై ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా కళ్లెం లక్ష్మణ్, బుర్ర మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని రాజశేఖర్, కార్యదర్శి బత్తిని రవీందర్, కోశాధికారిగా రాపోలు వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

చిత్రహింసలు పెట్టిన వారిని శిక్షించాలి

విద్యానగర్(కరీంనగర్): ముస్లిం యువతిని ప్రేమించాడనే కారణంతో దళిత యువకుడిని విచక్షణరహితంగా హింసించిన ఎంఐఎం నాయకుడు అబ్బాస్ షమీ, అతడి అనుచరులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్, గోస్కి శంకర్, ఆవారి లత, గసికంటి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. దళిత సామాజిక వర్గానికి చెందిన చింత భరత్ రామగుండంకు చెందిన ముస్లిం యువతి ప్రేమించుకున్నారని, నాలుగు రోజుల క్రితం ఆ యువతి భరత్‌కు ఫోన్ చేసి తనను తీసుకెళ్లాలని కోరడంతో రేకుర్తిలోని తనకు తెలిసిన వారి ఇంటికి తీసుకవచ్చారని తెలిపారు. యువతిని తీసుకవచ్చిన భరత్‌ను ముస్లిం యువకులు అడ్డుకుని విచక్షణారహితంగా కొట్టారని అన్నారు. విషయాన్ని ఎక్కడైన చెప్పితే చంపుతామని బెదిరించి విడిచిపెట్టారని వివరించారు. అబ్బాస్ షమీ, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకుని భరత్‌కు రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకోవాలి

భరత్‌ను హింసించిన ఎంఐఎం నాయకుడు, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందు పరిషత్ జిల్లా కార్యదర్శి అదిమూలం విద్యాసాగర్, బజరంగదళ్ విభాగ కన్వీనర్ తోట ప్రదీప్ కుమార్, నాయకులు శ్రీకాంత్, శంకర్, శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేందర్, శివ, అజయ్ కోరారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కంపుకొడుతున్న కాలనీలు



హైస్కూల్ ప్రాంతంలో నిండిన చెత్త



మురుగు నీరుతో నిండిన డ్రైనేజీ



సీసీ రోడ్డు పక్కన చెత్త

- అధికారుల పర్యవేక్షణ లోపం

మానకొండూర్‌రూరల్: మండలంలోని వివిధ గ్రామాలలో పారిశుధ్యం లోపిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత, ప్రత్యేకాధికారుల పాలన, అధికారులు ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉండటంతో పల్లెలు కంపు కొడుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసిన మురుగునీటితో నిండిన డ్రైనేజీలు, చెత్తతో పేరుకు పోయిన వీధులు, దర్శన మిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో ఇన్‌చార్జి కార్యదర్శుల నిర్లక్ష్యం, ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని నిబంధనలున్నా వైద్య సిబ్బంది కన్నెత్తి కూడా చూడకపోవడంతో ప్రజలు పరిశుభ్రత పాటించక రోగాల బారిన పడుతున్నారు. సంబంధిత జీపీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇటుక బట్టీలకు చెరువు మట్టి

- వ్యవసాయ పొలాల్లోకి చేరాల్సిన మట్టి ఇటుక బట్టీలకు తరలింపు
- ఉపాధిహామీలో మట్టితీత పనులు
- అవకతవకలపై చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు



చెరువులో మట్టి పనుల్లో ఉపాధి కూలీలు



ఇటుక బట్టీల వద్ద పోసిన మట్టి కుప్పలు

జమ్మికుంట: సారవంతమైన చెరువు మట్టితో వ్యవసాయ భూమిలోకి చేరితే పంట దిగుబడి పెరుగుతుందని మట్టిని పొలాల్లోకి చేర్చుకునేందుకు రైతులు నామమాత్రం రుసుము చెల్లించాలని, గ్రామాల్లోని ఉపాధి కూలీలకు పని కల్పించినట్టు అవుతుందని కేంద్ర ప్రభుత్వం సంకల్పించి ఆ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ గ్రామస్థాయి అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఇటుక బట్టి వ్యాపారులకు అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని మాచనపల్లి గ్రామంలో చెరువు మట్టి తీత పనుల్లో తాజా మాజీ ప్రజాప్రతినిధుల కలిసి మట్టి అమ్మకాలు జరుపుతున్నారని, గ్రామస్తులు సోమవారం ఆరోపించారు. రైతులకు అందించాల్సిన మట్టి ఇటుక బట్టీల వద్ద నిల్వ చేయడాన్ని అధికారులు, గ్రామస్తులు గుర్తించారు. రైతుల చెందాల్సిన మట్టి అని గ్రామస్తులు అడుగ్గా స్పందించడం లేదని, దురుసుగా మాట్లాడుతున్నారని, మట్టి అమ్మకాల అవకతవకలపై ఉన్నాతాధికారలు విచారణ చేసి రైతులకు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇటుక బట్టీలకు అమ్ముతున్నారు

చెరువులో ఐదు రోజులుగా ఈజీఎస్ ద్వారా మట్టి తీత పనులు జరుగుతున్నాయి. స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు ఆమట్టిని ఇటుక బట్టిలకు అమ్ముకుంటున్నారు. లెదర్ పార్క్ సమీపంలో ఇటుక బట్టీలకు ట్రిప్పుల కొద్ది మట్టిని తరలించారు. ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– దొంతరవేణ రమేశ్, మాజీ ఉపసర్పంచ్, మాచనపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం

గ్రామానికి చెందిన ముగ్గురు ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు చెరువు మట్టి కోసం దరఖాస్తు చేసి తరలించారు. ఇటుక బట్టీల వద్ద మట్టి మాచనపల్లి వారు ఇచ్చారని వారి పేర్లు తెలియవని ఇటుక బట్టీల నిర్వాహకుడు తెలిపారు. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియజేశాం.

– శివరంజని, కార్యదర్శి, మాచనపల్లి

రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి



హుజూరాబాద్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



చొప్పదండిలో...



తిమ్మాపూర్‌లో...

తిమ్మాపూర్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన, ధాన్యం తడిసిన రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు తిమ్మాపూర్ తహసీల్దార్ కోడెం కనకయ్యను కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులతో కలిసి తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి నాయకులు, రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కొనుగోళ్లు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ నెరవేర్చాలన్నారు. తరుగు, తాలుతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ఇవ్వలేదని గుర్తు చేశారు. రైతులకు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి అండగా ఉండాలని కోరారు.

ఇల్లందకుంట: రైతాంగాన్ని ఆదుకోవాలని, ఇచ్చిన హామీలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు విమర్శించారు. సమస్యల పరిష్కారంలో విఫలమైందని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్త సాగు విధానంతో పాటు పంటల సమగ్ర ప్రణాళిక విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మానకొండూర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలను త్వరగా కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి సరికాదని బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి అన్నారు. ధాన్యం కేంద్రాల వద్ద ధాన్యానికి సరిపడా టార్పాలిన్లు సమకూర్చాలని డిమాండ్ చేశారు.

చిగురుమామిడి: రైతాంగ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. బస్టాండ్ నుంచి కార్యాలయం వరకు బైక్ ర్యాలీగా వచ్చారు.

జమ్మికుంట: బీజేపీ టౌన్ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు.

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకొని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.

చొప్పదండి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాయకులు తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందించారు.

గన్నేరువరం: ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ భిక్షపతికి వినతి అందజేశారు.



ఆత్మీయ సమ్మేళనం

శంకరపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల 2001–02 పదో తరగతి విద్యార్థులు సోమవారం కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకొని ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం పొందారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ఐలయ్య, హాదియా, పద్మ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

- **టీచర్ల సస్పెండ్ సరికాదు**

కరీంనగర్: అన్నింటికీ ఒకే మంత్రం అన్నట్లు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ఒక ప్రకటనలో ఖండించారు. వేసవి సెలవుల కారణంగా ఇళ్లలో ఉంటున్న సమయంలో పాఠశాలలో ఏం జరుగుతుంది అనే విషయం ఎవరికీ తెలిసే అవకాశం లేదన్నారు. నైట్ వాచ్‌మెన్ చేయాల్సిన పనులను ఉపాధ్యాయుల మీదకు నెట్టి బాధ్యులుగా చేసి సస్పెండ్ చేయడం సరికాదన్నారు.

- **ప్రమాదవశాత్తు బావిలో పడిన నక్క**

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం వ్యవసాయ బావిలో నక్క పడిపోయింది. మక్త గ్రామానికి చెందిన ముప్పిడి విజయేందర్‌రెడ్డి నక్క బావిలో పడిన విషయాన్ని అటవీశాఖ అధికారులకు చేరవేశాడు. సెక్షన్ ఆఫీసర్ సరిత, బీట్ ఆఫీసర్ నసీరుద్దీన్ బావిలో నుంచి నక్కను బయటకు తీయగా సమీప గుట్టల్లోకి వెళ్లిపోయింది.

- **హైనాదాడిలో దూడ మృతి**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో శ్రీరామోజు బ్రహ్మచారికి చెందిన దూడ హైనాదాడిలో మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా పశువుల పాకలో కట్టేసిన దూడను హైనా కొంత దూరం ఈడ్చుకెళ్లి చంపేసిందని బ్రహ్మచారి తెలిపారు. దూడ విలువ రూ.15వేలు ఉంటుందని, రోజురోజుకు హైనాదాడులు ఎక్కువై పోతున్నాయని, ఫారెస్టు అధికారులు స్పందించి హైనా దాడుల నుంచి పశువులను కాపాడాలని కోరాడు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి

సైదాపూర్: మండలానికి మంజూరైన వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన నిర్మాణానికి జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి సోమవారం మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో స్థల పరిశీలన చేశారు. గతంలో సుమారు 5 ఎకరాల్లో బీసీ కాలనీకి కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మాణం చేయకపోవడంతో ఆ స్థలంలో హరితహారం కార్యక్రమంలో సైదాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఇటీవల మండలానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరైంది. అది నిర్మించడానికి మండలంలో ఎక్కడ స్థలం అనుకూలంగా లేకపోవడంతో ఆ స్థలం మార్కెట్ కమిటీకి కేటాయించారు. కాగా ఆ భూమికి దారి లేకపోవడంతో జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ మంజుల దారి ఇవ్వడానికి అక్కడున్న రైతులతో మాట్లాడారు. దారికి ఇచ్చిన భూమికి డబుల్ భూమి ఇస్తామంటేనే దారికి భూమి ఇస్తామని రైతులు తేల్చి చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడతామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజా, ఎంపీడీవో యాదగిరి, పీఆర్ ఏఈ యాదగిరి, రైతులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కరీంనగర్ రోడ్డులోని శాంతా కాలేజ్ పక్కన అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్) సూచనల మేరకు కూల్చివేసినట్లు హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య తెలిపారు. సర్వే నం. 24/ఎ లో అనుమతి లేకుండా అక్రమంగా, అనాధికారికంగా నిర్మించిన రెండు షెడ్డులను తొలగించామని, పలు మార్లు నోటీసులిచ్చామన్నారు. సోమవారం పోలీసు బందోబస్తు మధ్య కూల్చి వేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అశ్విని గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు .

గడువులోగా పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న నవీన్‌కుమార్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట ఉన్నత పాఠశాల, ప్రాథమిక బాలుర, బాలికల, అబాది ఎస్సీ కాలనీ పాఠశాలలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లోని పనులను ప్రత్యేక అధికారి, జిల్లా జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్ నవీన్‌కుమార్, ఎంఈవో విదుపు శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అర్బన పరిధిలోని అన్ని పాఠశాలలో కరెంటు, టాయిలెట్ రిపేర్లు, నీటివసతి, మేజర్, మైనర్ రిపేర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, పూర్ణచందర్, మణెమ్మ, మున్సిపల్ వర్క్ఇన్‌స్పెక్టర్ అకాశ్, సాయి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, స్వరూప, షమీమ్‌బేగం, సీఆర్పీలు సురేశ్, రవి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హుజూరాబాద్: యాదవ కులస్తుల ఆరాధ్య దైవం బీరన్న కల్యాణ ఉత్సవానికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. పూజారులు కల్యాణోత్సవంతోపాటు ఇతర కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్‌యాదవ్, కౌన్సిలర్ మక్కపల్లి కుమారస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరేణి సమ్మయ్య, నాయకులు తొర్రి చిన్న సమ్మయ్య, అశోక్, బాషబోయిన సదానందం, రాజ కొమురయ్య, ఓదెలు, గంద్రకోట రమేశ్, గంద్రకోట సారయ్య, మక్కపెల్లి రమేశ్, సింగరేణి రవి, జక్కుల రాజు, లెంకలపల్లి, కుమార్, నవీన్, రవి, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవం



శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో శ్రీమానసాదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం అర్చకులు పెండ్యాల అమర్‌నాథ్‌శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు భస్మాభిషేకం నిర్వహించారు. అలాగే త్రిశూల స్నాన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల సందడి



ఆలయంలో భిక్ష చేస్తున్న స్వాములు

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని శ్రీ పాంబండ పంచముఖాంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో స్వాములు మాల దీక్ష స్వీకరించారు. దాదాపు వంద మంది భక్తులు హాజరై దీక్ష స్వీకరించగా శ్రీ హుమేశ్ స్వామిజీ భక్తులకు మాలధారణ చేశారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హుమేశ్ కోరారు.

ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

శంకరపట్నం: మండల కేంద్రంలోని దర్గాలో ముస్లింలు సోమవారం సాయంత్రం గంధం ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో వాజిద్, మన్సూర్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.